క్లుప్తంగా

సదరం సర్టిఫికెట్లకు దరఖాస్తులు

అడ్డతీగల: దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు పొందడానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ తెలిపారు. అర్హులైన దివ్యాంగులు వారికి సమీపంలో ఉన్న మీ సేవా కేంద్రంలో గాని లేక గ్రామ సచివాలయాల్లో గాని సదరం స్లాట్‌ల బుకింగ్ కోసం సంప్రదించాలన్నారు. గురువారం నుంచి ఆరంభమైన ఈ కార్యక్రమం సెప్టెంబర్ 30 వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. స్లాట్‌లలో నిర్దేశిత ఆస్పత్రి, తేదీ, సమయం పేర్కొనడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి తరలిరండి



పద్మారావు

ముంచంగిపుట్టు: పాడేరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు పిలుపునిచ్చారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అమలుచేయలేని హామీలను ఎన్నికల్లో ఇచ్చి చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రజలకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చి విస్మరించిందని, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. రోజు రోజుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చంద్రబాబు మోసాలపై పాడేరులో జరిగే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్

గూడెంకొత్తవీధి: ప్రతీ గ్రామంలోను విధిగా శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఆయన కార్యాలయంలో గురువారం కార్యదర్శులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడంతో దోమలు ఉండవన్నారు. దీంతో రోగాలు రావని సూచించారు. తాగునీటి ట్యాంకులు కూడా పరిశుభ్రం చేయాలని సూచించారు. క్లోరినేషన్ తప్పకుండా చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు పూర్తి చేయాలన్నారు. గోతుల్లో నీరు ఉండే విధిగా బ్లీచింగ్ చేయాలని సూచించారు.డిప్యూటీ ఎంపీడీవో మహేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సత్కారం



ఎంపీడీవో శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పడాల్

చింతపల్లి: మండల ఎంపీడీవోగా శ్రీనివాసరావు చేసిన సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య కొనియాడారు. చింతపల్లిలో ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరావును సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావుకు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. సీనియర్ అసిస్టెంట్ రామారావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జయంతి ఏర్పాట్లు పరిశీలన

గొలుగొండ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 జయింతి వేడుకలు ఏర్పాట్లను నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. పార్కులో శుక్రవారం అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేయడం జరిగింది. దీని కోసం పార్కును అందంగా తీర్చిదిద్దారు. అల్లూరి ఉత్సవ కమిటీ, టూరిజం శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ తారకేశ్వరరావుకు డీఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



ఊరేగింపులో భక్తులు

రావికమతం: చినపాచిల గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి పసుపు, కుంకుమ, సారె ఇచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నీరు నిలిచిందిలా.. నడిచేదెలా!



వేగితోట జంక్షన్‌లోని బోరింగు వద్ద నిలిచి ఉన్న వర్షపునీరు, డ్రైనేజీనీరు



చింతూరులోని సినిమాహాల్ రహదారిపై వదిలేసిన డ్రైనేజీ పూడిక



ఎర్రంపేటలోని ఎంపీపీ పాఠశాల ఎదుట నిలిచిన వర్షపునీరు



చింతూరులోని ఓ కళాశాల ఎదుట గోతుల్లో నిలిచిన వర్షపునీరు

చింతూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లోని వీధుల్లో వర్షపునీరు నిలిచిపోయి ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపునీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు చింతూరు, ఎర్రంపేట ఇతరత్రా ప్రాంతాల్లో డ్రైనేజీలు దారుణంగా ఉన్నాయి. రోజుల తరబడి పూడిక తీయకపోవడంతో మురుగునీరు నిలిచిపోతోందని, మరింత ఎక్కువై రహదారులపై పారుతోందని స్థానికులు చెబుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని, దుర్గంధంతో సతమతమవుతున్నామని చెబుతున్నారు. కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందంటున్నారు. వర్షపునీరు ఇలాగే నిలిచి ఉంటే వ్యాధులు ప్రబలే ప్రమాదముందని అధికారులు చొరవచూపి రహదారుల ప్రక్కన నిలిచివున్న వర్షపునీరు తొలగించేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

తాగునీరు కలుషితం

చింతూరులోని వేగితోట జంక్షన్ వద్ద రహదరి పక్కనే ఉన్న బోరింగు వద్ద భారీగా వర్షపునీరు నిలిచి ఉంది. బోరింగు వద్ద డ్రైనేజీ ఉన్నా పూడిక తీయకపోవడంతో వర్షపు నీరంతా బోరింగు చుట్టూ నిలిచి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

మరోవైపు డ్రైనేజీలోని మురుగునీరు కూడా వెనుకకు వచ్చి బోరింగు వద్ద నిలిచి ఉంటుందని చెబుతున్నారు, దీంతో మురుగునీరు బోరింగులోకి కూడా వెళుతుందని, ఆ నీటినే తాము తాగుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలోమని మరిన్ని ఇళ్లకు వెళ్లే దారిలో సైతం వర్షపునీరు నిలిచి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారిపైనే పూడికచెత్త

చింతూరులో సినిమాహాలు వద్ద నుంచి పోస్టాఫీసు వరకు ఉన్న రహదారి వెంబడి డ్రైనేజీలోని పూడికతీసి ఆ మట్టిని ఈ దారిపైనే వదిలేశారు. దీంతో వర్షాలకు అది బురదగా మారి రహదారిపైకి చేరి నడిచేందుకు ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిత్తడి దారులతో అవస్థలు

ఎర్రంపేటలోని పాఠశాల ముందు వర్షపునీరు భారీగా నిలిచి ఉంది. దీంతో విద్యార్థులతో పాటు ఆ రహదారి మీదుగా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి వర్షపునీరు ఉందని స్థానికులు చెబుతున్నారు. చింతూరు మండలం ఎర్రంపేటలోని పాఠశాలకు రహదారి వర్షపునీటితో చిత్తడిగా మారింది. ఈ రహదారిలో నడిచేందుకు వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిత్తడి దారి వల్ల విద్యార్థులు, వాహనచోదకులు పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లోని వీధుల్లో రహదారులను బాగు చేయాలని వారు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా సర్వీసులు.. ప్రయాణికుల ఇబ్బందులు



ఉదయం వేళలో గుంటసీమ వెళ్తున్న ఆర్టీసీ బస్సు

దుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమలో వారం రోజులుగా అస్తవ్యస్త సమయాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండడంతో గిరిజనులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 5 గంటలకు అరకులోయలో బయలదేరి, దుంబ్రిగుడలో 5:30కు చేరుకుంటుంది. గుంటసీమలో 6 గంటలకు చేరుకొని మరలా తిరుగు ప్రయాణంలో 6:30 గంటలకు బయలుదేరి 7 గంటలకు దుంబ్రిగుడ, 7:30 కు అరకులోయ చేరుకుంటుంది. దీంతో గుంటసీమ ప్రాంతంలో ఉద్యోగులు చేసే ఉద్యోగులు, గిరిజనులకు ఎటువంటి ఉపయోగం లేకుండా వేలపాల లేకుండా తిరుగుతుందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల విధులకు వెళ్లే సమయం 8:30 గంటలకు దుంబ్రిగుడ నుంచి గుంటసీమకు బస్సు ఉండేలా చర్యలు తీసుకోవాలని పాడేరు డీపో మేనేజర్‌కు కోరుతున్నారు.

వరదలపై సమీక్ష సమావేశం రేపు

ఎటపాక: రానున్న గోదావరి వరదలపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కారం సుబ్బారావు గురువారం తెలిపారు. ఎటపాకలో ఉదయం 11గంటలకు ఏర్పాటు చేస్తున్న సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. వరదల అప్రమత్తతపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

మృతుని కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రామలింగం పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: మండలంలోని కొమ్మంగి పంచాయతీ పరిధిలోని కొలపరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాటుకూరి వినయ్ తండ్రి రామలింగం అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాడేరు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కొలపరి గ్రామానికి చేరుకుని రామలింగం పార్థీవ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చింతపల్లి, జీకే వీధి ఎంపీపీ కోరాబు అనూషదేవి, బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి గణబాబు, పెదబరడ సర్పంచ్ గోపాల్, ఎంపీటీసీ సభ్యులు రూతు, నాయకులు మోరి రవి, బూసరి కృష్ణారావు, మత్యరాజు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రాత్రిపూట రోడ్లపై అనవసరంగా తిరగొద్దని ఎస్ఐ జె.రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేసే విధంగా గురువారం ఎస్ఐ రామకృష్ణ విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న దొంగతనాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందని, రాత్రిపూట పెట్రోలింగ్ సైతం నిర్వహిస్తున్నారని, తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. ప్రజలంతా దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో అనుమానస్పదంగా ఎవరూ తిరిగినా తమకు సమాచారం అందజేయాలని కోరారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5గంటల వరకు ఎవరూ బయట తిరగొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తే దొంగతనాలు నివారించవచ్చన్నారు. వీలైతే దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చాలా మంచిదని, రాత్రి పూట ఇంటి బయట విద్యుత్ దీపాలు వెలిగించే ఉంచాలని ఆయన మండలవాసులను కోరారు.

క్లోరినేషన్‌తో శుద్ధమైన తాగునీరు



నీటి శాంపిల్స్‌ను సేకరిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

దుంబ్రిగుడ: మండల వ్యాప్తంగా ఉన్న బోరు బావుల్లో క్లోరినేషన్ చేయడంతో శుద్ధమైన తాగునీరు గిరిజనులకు అందుతుందని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ అన్నారు. మండలంలోని సొవ్వా, సాగర పంచాయతీలో ఆయన గురువారం సందర్శించి తాగునీటి అందించే ట్యాంకు నీరును పరిశీలించారు. ట్యాంకులో ఉన్న నీరును టెస్టింగ్ చేసి ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పంచాయతీరాజ్ కమిషన్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని బోరుబావుల్లో వాటర్ టెస్టింగ్ నిర్వహించి దాని వాల్యూవేషన్ తక్కువగా ఉంటే క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న బోరు బావులు, చేతి పంపు బోరులతో పాటు అన్ని బావులను పరిశీలించి వాటర్ టెస్టింగ్ నిర్వహించి క్లోరినేషన్ చేయడం జరుగుతందన్నారు. ఈవోపీఆర్డీ, ఇంజనీర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు సుధ, వల్లిభాయ్, నంద, రాములమ్మ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు బాలదేవ్, ధర్మనపడాల్

పాడేరు రూరల్: గిరిజన సంక్షేమశాఖ వసతి గృహలతో పాటు గ్రామల్లో వైద్య శిబిరాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలదేవ్, ధర్మనపడాల్ తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా గత కొద్ది రోజులుతా విస్తృతంగా భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు ముందస్తు జాగ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రధానంగా గిరిజన సంక్షేమ వసతి గృహల్లో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు, నిర్వాహకులు పర్యవేక్షించాలని కోరారు.

రోడ్ల విస్తరణ వెంటనే చేయాలి

కొయ్యూరు: మండలంలో రహదారుల విస్తరణను వెంటనే చేపట్టాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొట్టడం రాజుబాబు డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అధికారులు విస్తరణలో జాప్యం చేయడం సరికాదన్నారు. రోడ్డుకు రెండు వైపులా 50 అడుగుల చొప్పున వెడల్పు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతోన్న దీనిని వేగవంతం చేయాలని తెలిపారు. రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి



కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణ

చింతపల్లి: పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్లాస్టిక్ వస్తువులు వాడకానికి దూరంగా ఉండడంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.రమణ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి ఆదేశాల మేరకు కెమిస్ట్రీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు చింతపల్లి వీధుల్లో ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని దానికి ప్రత్యమ్నాయంగా ఉన్నటువంటి వస్తువులు వాడకాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు కె.సంతోషి, లీలాపావని, రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధంతో సతమతం



తహసీల్దార్ కార్యాలయం వద్ద చెత్త కుప్పలు

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పరిసరాలు అధ్వానంగా మారాయి. ఇక్కడ రోజుల తరబడి చెత్త తొలగించలేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న వారు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. తీవ్ర దుర్గంధంతో సతమతమవుతున్నారు. కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తచెదారాలు పేరుకుపోయి డంపింగ్ యార్డుగా మారింది. పారిశుధ్యం కొరవడడంతో ఈగలు, దోమలు ప్రబలుతున్నాయని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సర్పంచ్ భాగ్యవతి ఔదార్యం



పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్‌లు అందజేస్తున్న భాగ్యవతి కుటుంబసభ్యులు

ముంచంగిపుట్టు: వర్షంలో తడుస్తూ విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల అవస్థలను చూసి చలించిన జర్రెల సర్పంచ్ బోరగం భాగ్యవతి తన సొంత సొమ్ముతో రెయిన్ కోట్‌లను కొనుగోలు చేశారు. భాగ్యవతి ఆదేశాలతో ఆమె కుటుంబసభ్యులు స్థానికి పారిశుధ్య కార్మికులకు ఆయా రెయిన్ కోట్‌లను వితరణ చేశారు. దీంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షంలో తాము పడుతున్న ఇబ్బందులు గుర్తించి తమకు రెయిన్ కోట్‌లు సమకూర్చిన సర్పంచ్ భాగ్యవతికి పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

విత్తనాల కొరతతో రైతులకు ఇబ్బందులు



మాట్లాడుతున్న పీసా కమిటీ మాజీ నేతలు చిన్నారావు, స్వామినాయుడు

కొయ్యూరు: వరి విత్తనాల కొరత మూలంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రపాలెం పీసా కమిటీ మాజీ కార్యదర్శి గోకిరి చిన్నారావు, మాజీ ఉపాధ్యక్షుడు స్వామినాయుడు అన్నారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. రైతులు విత్తనాలు దొరకక తల్లడిల్లుతున్నారన్నారు. నాలుగు ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతుకు ఒక బస్తా ఇచ్చి సరిపెడుతున్నారని ఆవేదన చెందారు. అరకొర విత్తనాల సరఫరాతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కడి నుండి విత్తనాలు పొందాలో తెలియక తికమకపడుతున్నారని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు సరఫరా చేసిందన్నారు. అయితే ఇప్పుడు ఈ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని వారు కోరారు.

లక్ష్యంతో చదివితే ఉన్నత విజయాలు





పెదబయలు, జడ్డంగిలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐలు రమణ, చినబాబు

పెదబయలు: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు చట్టాలపై ఎస్ఐ కొల్లి రమణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. విద్యార్థులు లక్ష్యంతో క్రమశిక్షణతో చదివితే ఉన్నత విజయాలు సాధించవచ్చన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం పాఠశాల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అమిత్ ఆనంద్, పోలీసు సిబ్బంది వెంకటరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి ఆశ్రమ హైస్కూల్ చదువుతున్న గిరిజన విద్యార్థినులకు జడ్డంగి ఎస్ఐ చినబాబు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై గురువారం అవగాహన కల్పించారు. పలు చట్టాల గురించి వివరించారు. గిరిజన బాలికలు అన్నిటా ధైర్యంగా ఉండాలన్నారు. బాగా చదువుకొని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్ఐ చినబాబు ఆకాంక్షించారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం



యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్న నాయకులు

రాజవొమ్మంగి: యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఫెడరేషన్ మండల అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ఆగస్టు 10వ తేదీ వరకు సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. ప్రతి రోజు సాయంకాలం నాలుగు గంటల నుంచి ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. కార్యదర్శి శ్రీను ఆయన వెంట వున్నారు.

ఘనంగా జాతీయ క్రీస్తు దినోత్సవం



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు, పాస్టర్లు

చింతపల్లి: చింతపల్లిలో క్రైస్తవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల పాస్టర్ల ఫెలోషిప్, షారోన్, యూసీడబ్ల్యూఏ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూసీడబ్ల్యూఏ అధ్యక్షుడు పాస్టర్ వి.సోమరాజు మాట్లాడుతూ దేశానికి క్రైస్తవ సువార్తను 52వ దశకంలో థోమస్ అనే క్రీస్తు శిష్యుడు తీసుకువచ్చారన్నారు. కేరళలో మొదటిగా ఇదే రోజున క్రైస్తవ ప్రాచారం ప్రారంభమైందన్నారు. ఈ నేపథ్యంలో ఏటా జూలై 3 ఇండియన్ క్రిస్టియన్ డే నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సీనియర్ పాస్టర్లు జ్యోతిరాజు, కాలేబు, రాజేష్, జేమ్స్, రాజు, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి

రంపచోడవరం: డివిజన్‌లో అక్రమ కట్టడాలకు సంబంధించి ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పెట్టిన కేసులు వాయిదాకు వచ్చినా గిరిజనేతరులకు అవకాశమిచ్చేందుకు అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌డీసీ కోర్టులో ఆదివాసులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో వాయిదాలు ఇవ్వడం సహజమే అని అయితే 1/70 చట్టం అమలులో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో వలస వచ్చిన గిరిజనేతరులు అక్రమించిన భూములకు ఎటువంటి పత్రాలు లేకపోయినావాయిదాలు ఇవ్వడం తగదన్నారు. ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని, ప్రభుత్వం న్యాయం జరిగేలా చూడాలని కోరారు.